సాక్షి
గుంటూరు
గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



యార్డుకు 32,598 బస్తాల మిర్చి


కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 32,598 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,198 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



రూ. 2.65 లక్షలు పలికిన లడ్డూ

సత్తెనపల్లి: రామాలయం వద్ద వినాయక చవితి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వేలంపాటలో లడ్డూను రూ.2.65 లక్షలకు జి. రామారావు దక్కించుకున్నారు.

రూ.లక్ష నాణేలతో అలంకరణ



అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని ఠాగూర్ పాఠశాల వద్ద బ్రాహ్మణ బజారులో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం 1,00,016 రూపాయ నాణేలతో గణ నాథుడు విగ్రహాన్ని ప్రత్యే కంగా అలంకరించారు.



గుంటూరు నగరంలోని అరండల్ పేట రోడ్డుపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో జనసందోహం



ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

జగనాభిమానం

- గుంటూరు నగరంలో ఎగసిపడ్డ అభిమాన తరంగం
- అడుగడుగునా వైఎస్ జగన్‌కు జన నీరాజనం
- పెద్దఎత్తున స్వాగతం పలికిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు
- భారీ బైక్ ర్యాలీలతో కిక్కిరిసిన నగరం

అధికారంతో పని లేదంటూ అధినాయకుడి ముందు గుంటూరు ప్రణమిల్లింది. కదలి అలల్ని తలపించేలా అభిమానం ఎగసి పడింది. అడుగడుగునా జనం నీరాజనం పలికారు. జననేతకు అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ప్రతిన బూనారు. ఎగసిపడే అభిమానంతో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వ అరాచక విధానాలపై గొంతెత్తి నినదించారు.

– పట్నంబజారు/నెహ్రూనగర్

జిల్లా జైలులో ఉన్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించేందుకు నగరానికి వచ్చిన వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వెంట వైఎస్సార్ సీపీ సైన్యం కదలివచ్చింది. అప్పటికే జిల్లా జైలు ప్రాంగణమంతా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిపోయింది. ఒకానొక దశలో అభిమానులు పోటెత్తడంతో అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఏర్పడింది. అక్కడ నుంచి భారీ జనవాహిని నడుమ వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎస్వీఎస్ కాలనీలో నివాసం ఉంటున్న క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి నివాసానికి బయలుదేరారు. అప్పటికే భారీగా చేరుకున్న పార్టీ కార్యకర్తలు, యువత, విద్యార్థులు భారీ బైక్ ర్యాలీతో ఆయన వెంట ముందుకు సాగారు.

కదలి వచ్చిన వైఎస్సార్ సీపీ సైన్యం

కాకాని రోడ్డు వై జంక్షన్ మీదుగా రెడ్డిపాలెం, ఇన్నర్‌రింగ్ రోడ్డు, అమరావతిరోడ్డు, లాడ్జి సెంటర్ వైపుగా బుధవారం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా జైలు ప్రాంగణానికి చేరుకున్నారు. వై జంక్షన్ నుంచే భారీగా బైక్ ర్యాలీలు, కార్లతో వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వేళంగిణినగర్ వద్ద పార్టీ శ్రేణులు భారీగా ఎదురేగి అభిమానాన్ని చాటారు. అమరావతి రోడ్డులో ఆలా ఆసుపత్రి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని విగ్రహం మండపం వద్ద మహిళలు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వాహనంపై పూలు జల్లుతూ అభిమానాన్ని చాటుకున్నారు.

లాడ్జి సెంటర్‌లో ఘన స్వాగతం

లాడ్జి సెంటర్‌లో పార్టీ క్యాడర్ స్వాగతం పలికింది. అక్కడ నుంచి కొరిటెపాడు ప్రధాన రహదారిలో చేరుకోగానే పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ బాణసంచా కాలుస్తూ వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి చిత్రపటాన్ని బహూకరించారు. ఆయన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగారు. కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తూ కాన్వాయ్‌లో ముందుకు కదిలారు. అక్కడ నుంచి గుజ్జనగుండ్ల చేరుకోగానే మహిళలు భారీ పూల వర్షం కురిపించారు. జగనన్నకు జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడ నుంచి ఎస్వీఎస్ కాలనీ నాలుగో లైనులో ఉన్న ఈదా సాంబిరెడ్డి నివాసానికి చేరుకున్నారు. జిల్లా జైలు నుంచి ఎస్వీఎస్ కాలనీ చేరుకునే సరికి గంటన్నరకు పైగా పట్టిందంటే.. అభిమానులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తరలివచ్చిన తీరు అర్థమవుతుంది.

టీడీపీ ఆటవిక పాలనకు చరమగీతం తప్పదు

గుంటూరు ఎడ్యుకేషన్: టీడీపీ ఆటవిక పాలనకు చరమగీతం పలుకుదామని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి, శస్త్రచికిత్స అనంతరం రెండు నెలలుగా మంచానికే పరిమితమైన క్రోసూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డిని బుధవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. సాంబిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యుల్ని పేరు, పేరునా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పలుకరించారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఐదుగురు ఆడపిల్లలు గల తమ కుటుంబం, ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న సాంబిరెడ్డి ప్రాణాలకు ఆపద రావడంతో తామంతా విలవిల్లాడిపోయామని ఈ సందర్భంగా ఆయన భార్య కన్నీటి పర్యంతరమయ్యారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి అనుచరులు, బంధువులు తమకు టీడీపీ నాయకుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్న విషయాన్ని వైఎస్. జగన్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో అంతా వికలాంగ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని వస్తున్న బెదిరింపులపై పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆయనకు వివరించారు. టీడీపీ దాడుల్ని సమర్థంగా ఎదుర్కొందామని, వారి దాడులకు భయపడేది లేదని వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని నాయకులు, కార్యకర్తలను భౌతిక దాడులతో భయపెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మా గుండెల్లో నువ్వే అన్నా అంటూ ఫొటో చూపుతున్న యువత



ఆటో ఎక్కిన అభిమానం



వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతూ యువకుల బైక్ ర్యాలీ



జెండా మాకు అండ

నినాదాలతో దద్దరిల్లిన గుంటూరు

గుంటూరు బైపాస్‌లోకి చేరుకున్న వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. వెల్లువెత్తిన పార్టీ శ్రేణులు, అభిమానంతో దూసుకెళ్లిన యువతతో ఆద్యంతం పర్యటన కొనసాగింది. యువత సీఎం.. సీఎం ! అంటూ పెద్దఎత్తున నినాదాలు చేయడంతో గుంటూరు ప్రధాన రహదారులన్ని దద్దరిల్లాయి. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మాజీ మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, పేర్ని నాని, ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరి రావు, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, సమన్వయకర్తలు షేక్ నూరిఫాతిమా, అంబటి మురళీకృష్ణ, అన్నాబత్తుని శివకుమార్, నంబూరు శంకరరావు, బలసాని కిరణ్, టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ జిల్లా, నగర కమిటీ నేతలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి డిగ్రీ సప్లిమెంటరీ మూల్యాంకనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూ ఐదో సెమిస్టర్ డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకన శిబిరం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ఈనెల 13న ప్రారంభవుతుందని ప్రిన్సిపాల్ పి.ఎం.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు 7వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష పత్రాల మూల్యాంకనం కూడా జరుగుతుందని వెల్లడించారు. మూల్యాంకన విధుల్లో పాల్గొనే అధ్యాపకులను విధుల నుంచి రిలీవ్ చేసి పంపాలని ఏఎన్‌యూ పరిధిలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను కోరారు.

రేపటి నుంచి నృసింహుని పవిత్రోత్సవాలు



మంగళగిరి: పట్టణంలోని ప్రసిద్ధ పానకాల లక్ష్మీనృసింహస్వామి పవిత్రోత్సవాలను ఈ నెల 13నుంచి 16వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఏ. రామకోటిరెడ్డి బుధవారం తెలిపారు. తొలి రోజు సాయంత్రం 4 గంటలకు అంకురారోహణతో ప్రారంభమై, చివరి రోజు పూర్ణాహుతి, శ్వేత పుష్ప గ్రామోత్సవంతో ముగియనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

15న ప్రీ-టెక్నికల్ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు సెంటర్ టైపు, షార్ట్‌హ్యాండ్ అండ్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న ప్రీ-టెక్నికల్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు బి. శ్రీనివాస్ సింగ్, భరణి టెక్నికల్స్ ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేట 3/10లోని మాస్టర్ మైండ్స్ పుష్ప భవన్‌లో జరగనున్న పరీక్షలకు గుంటూరు నగర పరిధిలోని ఇనిస్టిట్యూట్స్ నుంచి విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. ప్రభుత్వం నిర్వహించే టైపు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రీ-టెక్నికల్ పరీక్షలు ప్రయోజనాన్ని చేకూర్చుతాయని వారు పేర్కొన్నారు.

వరద నష్టాలను సక్రమంగా నమోదు చేయాలి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: జిల్లాలో వరద ముంపు ప్రాంతాల్లో నిర్వహించిన ఎన్యుమరేషన్ వివరాలను యాప్‌లో సచివాలయ ఉద్యోగులు సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి బుధవారం ఆమె మాట్లాడారు. ఎన్యుమరేషన్ యాప్‌ను సక్రమంగా అర్థం చేసుకుని, వివరాల్ని క్రమ పద్ధతిలో నమోదు చేయాలని చెప్పారు. దీని ద్వారానే బాధితులకు నష్టపరిహారం ఇచ్చే వీలుంటుందని తెలిపారు. బాధితులు నష్టపోయిన పంట, ఇళ్లు, పొలాలు, పశువులు, వాహనాలు, ఇతర వివరాలతోపాటు ఫొటోలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. దీని కోసం ప్రతి సచివాలయంలో ఐదు లాగ్‌లు ఇచ్చామన్నారు. పది మంది సచివాలయ ఉద్యోగులు వీటిని ఉపయోగించుకునే వీలుంటుందని చెప్పారు. యాప్‌లో నమోదు చేసిన వివరాలను మండల, జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, సచివాలయ జిల్లా కోఆర్డినేటర్ రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బలవంతంగా గణపతి విగ్రహం నిమజ్జనం

వైఎస్సార్ సీపీ వర్గీయులతో పోలీసుల అనుచిత వైఖరి

సాక్షి, నరసరావుపేట: వినాయక విగ్రహాల ఏర్పాటులో పోలీసులు పక్షపాత వైఖరి చూపుతున్నారని కారుమంచి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు ఆరోపించారు. శావల్యాపురం, కారుమంచి గ్రామంలో చవితి సందర్భంగా వేడుకల కోసం 11 రోజులపాటు అనుమతులు పొందారు. శావల్యాపురం ఎస్సై లోకేశ్వరరావు ఇక్కడి అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో విగ్రహాన్ని వెంటనే నిమజ్జనం చేయాలని నిర్వాహకులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి బెదిరించినట్లు తెలిపారు. గత్యంతర లేని పరిస్థితిలో విగ్రహాన్ని బుధవారం ఉదయాన్నే నిమజ్జనం చేసినట్లు చెప్పారు. గ్రామంలో మిగిలిన మూడు విగ్రహాలు యథావిధిగా 11 రోజుల ఉత్సవాలకు ఉంచారని, తమతో మాత్రం బలవంతంగానిమజ్జనం చేయించారని వాపోయారు. దేవుడి ఉత్సవాల్లో రాజకీయం మంచి సంస్కారం కాదన్నారు. 11 రోజుల అనుమతి ఇవ్వలేదని పోలీసులు ఇప్పుడు పేర్కొంటున్నారని నిర్వాహకులు చెంచయ్య, ఆదయ్య, రామాంజనేయులు, శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశాన్నారు.

నష్టం తేలింది.. కష్టమే మిగిలింది!

పల్నాడులో పంట నష్టం లెక్కింపు పూర్తి చేసిన యంత్రాంగం

- భారీ వర్షాలు, వరదలతో రైతులు కుదేలు
- క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యాన శాఖల పరిశీలన
- జిల్లాలో 2,905.54 హెక్టార్లలో దెబ్బతిన్న సాగు
- మొత్తం రూ.4.9 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదన
- 33 శాతానికిపైగా దెబ్బతింటేనే వివరాలు నమోదు



అమరావతి మండలంలో దెబ్బతిన్న బొప్పాయి మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి

సాక్షి, నరసరావుపేట: అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, కృష్ణా నది వరదలతో దెబ్బతిన్న పంటల వివరాలను జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు నమోదు చేశారు. ఆయా రైతులకు అందజేయాల్సిన నష్ట పరిహారాన్ని లెక్కించారు. జిల్లాలో వ్యవసాయ పంటలకు సంబంధించి మొత్తం 8,818.48 హెక్టార్లు దెబ్బతినగా.. ఇందులో 33 శాతం కన్నా ఎక్కువ నష్టపోయిన పంటలు 2,852.747 హెక్టార్లలో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. 3,344 మంది రైతులకు రూ.4.9 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించాల్సి ఉంటుందని లెక్కకట్టారు. వరి, పత్తి, మిరప, కూరగాయలు, బొప్పాయి, పూల పంటలకు హెక్టారుకు రూ.17 వేలు, మొక్కజొన్నకు రూ.12,500, అపరాలకు రూ.10 వేలు, జూట్ పంటకు రూ.8.5 వేల చొప్పున నష్ట పరిహారాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. మరోవైపు ఉద్యాన పంటలకు సంబంధించి 76 మంది రైతులకు చెందిన 52.8 హెక్టార్లలో పంట దెబ్బతింది. వీరికి రూ.9.45 లక్షల పరిహారం అందనుంది. ఉద్యాన పంటల్లో అరటి పంటకు హెక్టారుకు రూ.25 వేలు, మిగిలిన వాటికి హెక్టారుకు రూ.17 వేలను ఇన్‌పుట్ సబ్సిడీ కింద ప్రభుత్వం రైతులకు అందజేయనుంది.

రకం	నష్టపోయిన రైతుల సంఖ్య	పంట విస్తీర్ణం (హెక్టార్లలో)	ఇన్‌పుట్ సబ్సిడీ (రూ.లక్షల్లో)
పత్తి	3,253	2,769.94	471.26
పెసర	8	7.65	0.76
మినుము	49	36.95	3.69
కంది	37	22.34	2.23
వరి	17	12.38	2.1
వేరుశనగ	2	2.8	0.47
మొక్కజొన్న	1	0.28	0.03
సోయా	1	0.4	0.04
ఉద్యాన పంటలు	76	52.8	9.45
మొత్తం	**3,344**	**2,905.54**	**490.04**

రెండు స్థాయిల్లో పరిశీలన...

గ్రామ స్థాయి పంట నష్ట పరిశీలన బృందంలో ఉండే వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, ఏఈవోలు క్షేత్రసాయిలో పర్యటించారు. 33 శాతం కన్నా అధికంగా దెబ్బతిన్న పంటల వివరాలు, రైతు పేరు, ఆధార్, బ్యాంక్ ఖాతా, ఫోన్ నెంబర్లు నమోదు చేశారు. ఆపై ఆ నివేదికలను మండల స్థాయి బృందంలో ఉన్న తహసీల్దార్, ఎంపీడీఓ, మండల వ్యవసాయాధికారి కమిటీ పరిశీలించి ఆమోదం తెలిపింది. జిల్లాలో ఉన్నతాధికారులకు వీటిని నివేదించారు. వాటి ఆధారంగానే ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేయనుంది.

16వ తేదీ వరకు సోషల్ ఆడిట్

గ్రామ, మండల స్థాయి కమిటీలు అందజేసిన నివేదికలను బుధవారం జిల్లా అధికారులు సమర్పించారు. ఈ నెల 16వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి వాటిని సోషల్ ఆడిట్ కోసం రైతులకు అందుబాటులో ఉంచనున్నారు. అభ్యంతరాలు స్వీకరించడంతోపాటు అర్హులెవరైనా ఉంటే నివేదికలో పేరు చేరుస్తారు. తుది నివేదికలను 19వ తేదీన ప్రభుత్వానికి సమర్పించనున్నారు. వీటి ఆధారంగా రైతులు నష్టపరిహారం అందనుంది.

రోజుల పసికందును విక్రయించిన కన్నతండ్రి

- బిడ్డను పెంచలేని స్థితిలో నగదు ఆశించి విక్రయం
- గుంటూరు శిశు సంరక్షణ కేంద్రానికి అప్పగింత

చినగంజాం: కన్న బిడ్డను పెంచడం భారంగా తలచి ఓ తండ్రి రోజుల పసికందును విక్రయించిన సంఘటన బాపట్ల జిల్లా చినగంజాంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం ప్రకారం చినగంజాం పంచాయతీ జాలమ్మ కాలనీకి చెందిన మానికల సుబ్రహ్మణ్యం భార్య లక్ష్మి గత నెల 30వ తేదీ చీరాల ప్రభుత్వ వైద్యశాలలో ఆడబిడ్డను ప్రసవించింది. ఆమెకు పుట్టిన బిడ్డ తొమ్మిదో సంతానం కాగా ఇకపై ఆమెకు బిడ్డలు పుట్టకుండా ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. అనంతరం ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందింది. ఇదిలా ఉండగా భట్టిప్రోలుకు చెందిన మీరాబీ అనే మహిళ తన స్నేహితురాలు ప్రభావతితో కలిసి వచ్చి అదే ఆస్పత్రిలో ఆడబిడ్డను ప్రసవించింది. బిడ్డను ఏడో నెలలో ప్రసవించడంతో మృతి చెందింది. ఆస్పత్రిలో ఉన్న సమయంలో మీరాబీ స్నేహితురాలు ప్రభావతికి, సుబ్రహ్మణ్యం కుటుంబానికి పరిచయం ఏర్పడింది. ఆ సమయంలో ప్రభావతి తన స్నేహితురాలికి సాయమందించేందుకు మీరాబీకి పుట్టిన బిడ్డ ఇన్‌క్యుబేటర్‌లో ఉంచామని నమ్మించింది. అటు తరువాత సుబ్రహ్మణ్యం కుటుంబ పరిస్థితిని తెలుసుకొంది. తొమ్మిది మంది సంతానం పోషించలేమనే వారి బలహీనతను తెలుసుకొని, పుట్టిన పసికందును వారికి ఇచ్చేలా రూ.1.20 లక్షలకు డీల్ కుదుర్చుకుంది. తన భార్య లక్ష్మి కర్మకాండలు ముగిసిన తరువాత బిడ్డను తీసుకెళ్లేలా వారి మధ్య ఒప్పందం చేసుకొంది. ఈ నెల 7వ తేదీ శనివారం ప్రభావతి చినగంజాం వచ్చి రోజుల పసికందును తీసుకొని వెళ్లి మీరాబీ చెంతన చేర్చింది. ఆస్పత్రి సిబ్బందికి మీరాబీ బిడ్డ చనిపోయిన సంగతి ముందుగానే తెలిసి ఉండటంతో ఆమె పక్కన ఉన్న బిడ్డ గురించి ఆరా తీశారు. అనుమానాస్పదంగా తోచడంతో ఆస్పత్రి అటెండెంట్‌లు డ్యూటీ డాక్టర్‌కు విషయం తెలియజేయడంతో వారు గుంటూరు కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 10 వ తేదీన ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు చినగంజాంకు సంబంధించిన కేసు కావడంతో ఇక్కడి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. చినగంజాం ఎస్‌ఐ ఎస్.రమేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. చినగంజాం జాలమ్మ కాలనీలో నివాసముంటున్న సుబ్రహ్మణ్యం తన సంతానంతో ఇంటి నుంచి కన్పించకుండా వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా చంటి బిడ్డను పోలీసులు గుంటూరు శిశుసంరక్షణ కేంద్రంలో ఉంచినట్లు వారు తెలిపారు. తన సోదరుడు సుబ్రహ్మణ్యం పసిబిడ్డను పెంచలేని స్థితిలో మీరాబీకి ఉచితంగా ఇచ్చారే తప్పా విక్రయించలేదని సోదరి శ్రీలక్ష్మి తెలిపింది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 5,600 గరిష్టం : రూ. 7,500

మోడల్ ధర రూ. 6,400

జగన్ భద్రతపై మరోసారి పోలీసుల వైఫల్యం

నగరంపాలెం: మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తోంది. ఐదేళ్లు సీఎంగా చేసిన ఆయన గుంటూరు నగరానికి వస్తే పట్టుమని పది మంది పోలీసులు కూడా కనిపించ లేదు. అతి తక్కువగా విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు సైతం ఎండ ధాటికి చెట్ల వద్ద నిలబడి ఫోన్లల్లో మాట్లాడుకోవడం కనిపించింది. సాధారణ ప్రజాప్రతినిధి మాదిరి పోలీసులకు విధులు కేటాయించడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు ఆందోళనకు గురయ్యారు.ఒక డీఎస్పీ, ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలు, అరకొరగా హెచ్‌సీలు, పీసీలను కేటాయించడం మరింత ఆందోళనకు గురిచేసింది. జగన్‌తో కరచాలనం చేసేందుకు ప్రజలు తీవ్రంగా పోటీపడ్డారు. ఒక దశలో కార్యకర్తలు, అభిమానులను నియంత్రించే దిశలో భద్రతా సిబ్బందికి సాధ్యపడలేదు.

గుంటూరు రేంజ్‌లో ఇద్దరు సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్‌లో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న సీఐలు కె.అంజయ్యను తుళ్లూరు ఎల్ అండ్ ఓ -2, షేక్ ఎండీ.నిస్సార్ బాషాను తెనాలి- 2 టౌన్ పీఎస్‌కు బదిలీ చేశారు.

చాకలి ఐలమ్మ నృత్య రూపకంలో తెనాలి యువ నర్తకి



నృత్య రూపకంలో అలేఖ్య పుంజాలతో తేజస్వి ప్రఖ్య



సీఎం రేవంత్‌రెడ్డితో నృత్య రూపక బృందంలో తేజస్వి ప్రఖ్య (ఎడమ), అలేఖ్య పుంజాల (కుడివైపు)

తెనాలి: తెలంగాణ సామాజిక ఉద్యమకర్త చాకలి ఐలమ్మ జీవిత చరిత్రపై తొలిసారిగా ప్రదర్శించిన నృత్య రూపకంలో తెనాలికి చెందిన యువనర్తకి ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య నర్తించారు. ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ నృత్యరూపకాన్ని కూచిపూడి, జానపద శైలిలో ప్రదర్శించారు. ఐలమ్మ జీవితంలోని ప్రధాన ఘట్టాలను, ఆమె సాగించిన సాయుధ రైతాంగ పోరాటాలను ప్రముఖ నర్తకి,

ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య అద్భుత ప్రదర్శన

తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల అద్భుత ప్రదర్శనతో కళ్లకు కట్టారు. డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ రచనకు కాన్సెప్ట్, నృత్య దర్శకత్వం అలేఖ్య పుంజాల చేశారు. ఈ ప్రదర్శనను తెలంగాణ సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు ఆసాంతం ఆసక్తిగా తిలకించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలోనూ ఈ ప్రదర్శనను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ప్రశంసించారు. ప్రొఫెసర్ అలేఖ్య బృందం సమన్వయంతో చక్కటి హావభావాలతో అద్భుతంగా చేయడంతోనే విజయవంతమైనట్టు ఆహూతులు అభినందించారు. ఈ బృందంలో తెనాలి నర్తకి తేజస్వి ప్రఖ్య ఉండటం విశేషం! కూచిపూడి నృత్యంలో ఎంఏ చేసిన ఈ యువనర్తకి దూరదర్శన్ బి గ్రేడ్ ఆర్టిస్ట్ కూడా. అనేక ప్రతిష్టాత్మక వేదికలపై నర్తించారు. వివిధ నృత్యరూపకాలు, నాటికలు, లఘుచిత్రాల్లోనూ నటించారు. పలు బహుమతులను అందుకున్నారు.

వరద నీటిలోపడి వృద్ధుడు మృతి

అవనిగడ్డ: రేపల్లెకు చెందిన మన్నే పూర్ణచంద్రరావు (72) మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంక వద్ద కృష్ణానదిలో శవమై తేలారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూర్ణచంద్రరావు మూడు రోజుల క్రితం మోపిదేవి గుడికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటినుంచి వచ్చారు. దక్షిణ చిరువోలులంక వద్ద కృష్ణానదిలో పూర్ణచంద్రరావు మృతదేహం కనబడగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని ఆధారాలను బట్టి బంధువులకు సమాచారం ఇవ్వగా దక్షిణ చిరువోలులంక చేరుకున్నారు. పంచనామా అనంతరం బుధవారం స్థానిక స్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. కాళ్లు కడుక్కునేందుకు పులిగడ్డ వార్పు వద్ద నదిలోకి దిగి ప్రమాదవశాత్తు నదిలో పడి మరణించి ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.



పూర్ణచంద్రరావు(ఫైల్)

ఎస్సీ వర్గీకరణ తీర్పును నిలుపుదల చేయాలి

గుంటూరు వెస్ట్: సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పుపై పార్లమెంట్ జోక్యం చేసుకుని రద్దు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ర్యాలీగా వచ్చిన ఆయన స్థానిక కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లను కులాల వారీగా వర్గీకరించుకోవచ్చనే సుప్రీం కోర్టు తీర్పుతో మాలలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఇది ఓటు బ్యాంకు రాజకీయాలను ప్రోత్సహిస్తుందని చెప్పారు. పార్లమెంట్ జోక్యం చేసుకుని వెంటనే తీర్పును రద్దు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాందుగల చైతన్య, బి.ప్రదీప్, స్టాలిన్ బాబు పాల్గొన్నారు.



కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు

భుజాలు తడుముకున్న టీడీపీ నాయకులు

- సాక్షిలో వచ్చిన కథనంపై మండిపాటు
- హడావుడిగా రోడ్లకు మరమ్మతులు
- ఆర్ అండ్ బీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష అంటూ కవరింగ్



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కంతేరు(తాడికొండ): పది రోజులుగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయినా ఎమ్మెల్యే తొంగి చూడలేదంటూ సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన వార్తకు టీడీపీ నాయకులు భుజాలు తడుముకొని తర్జనభర్జన పడ్డారు. ఎట్టకేలకు నాలుగు లారీల బండరాళ్లు, రెండు లారీల మిక్స్‌డ్ డస్ట్ వేసి జేసీబీ సాయంతో పూడ్చివేసి తాత్కాలికంగా రాకపోకలకు అంతరాయం లేకుండా చూశారు. అయితే, తమపై పడిన బురదను ఎలా కడుక్కోవాలా అని బాగా ఆలోచించిన టీడీపీ నాయకులు అనుకున్నదే తడవుగా ఎల్లో మీడియాను పిలిచి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సాక్షి పత్రికపై బురద చల్లే యత్నం చేశారు. మా ఎమ్మెల్యే ఆర్ అండ్ బీ అధికారులతో పార్టీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించి మరమ్మతులు చేయాలని ఆదేశించారని తెలపడం విశేషం. వాస్తవానికి పది రోజులుగా రాకపోకలు స్తంభించాయి. గ్రామస్తులు గుంటూరు లేదా తుళ్లూరు మీదుగా తాడేపల్లి వెళ్లి మంగళగిరి, నాగార్జునా యూనివర్సిటీకి రాకపోకలు సాగించి నానా ఇబ్బందులు పడ్డారు. ప్రజల ఇబ్బందులను కళ్లకు కట్టినట్లు సోమవారం సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో బండారం బట్టబయలైంది. అంతా పర్యవేక్షణే ఉంటే పది రోజుల పాటు ఎందుకు నిలిచిపోయాయంటూ స్థానికులు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకుడు వాసిరెడ్డి జయరామయ్య ఈ నెల 5న ఆర్ అండ్ బీ ఎస్ఈని తీసుకొచ్చి దెబ్బతిన్న రోడ్డును చూపించారు. అయినప్పటికీ రోడ్డుకు చారెడు మట్టి వేసిన నాథుడు లేకపోవడంతో ప్రయాణికులు నానా పాట్లు పడ్డారు. సాక్షిలో వచ్చిన కథనంతో సమస్య పరిష్కారం కావడంతో పలువురు అభినందించారు. దీంతో ఇరకాటంలో పడ్డ టీడీపీ నాయకులు క్రెడిట్ తమకు దక్కలేదనే బాధతో సమావేశం ఏర్పాటు చేసి బురద చల్లేందుకు యత్నించడంపై పలువురు మండిపడుతున్నారు. నిజానికి తాడికొండ- కంతేరు, తాడికొండ- నిడమర్రు, నీరుకొండ గ్రామాల మధ్య వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగినప్పటికీ ఎమ్మెల్యే ఒక్కరోజు కూడా పరిశీలనకు రాలేదు. పంట నష్ట పరిహారం విషయంలో కూడా అధికారులు కూడా ఇంతవరకు రైతుల వద్దకు వెళ్లిన దాఖలాలు కూడా లేవు.

గణపయ్యకు రూ.25 లక్షలతో అలంకరణ



రూ.25 లక్షలతో గణపయ్యను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మాచర్ల రూరల్: శ్రీ గణపతి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని 13వ వార్డు, పత్తి ఫ్యాక్టరీ వీధిలో శ్రీలక్ష్మీగణపతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ధనలక్ష్మి అలంకరణలో గణపతి అలంకరించి వివిధ రూపాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.25 లక్షలతో గణపయ్యను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బాలలకు ఆర్థిక సహాయం విడుదల

నరసరావుపేట: జిల్లాలో మిషన్ వాత్సల్యం పథకం కింద అర్హులైన 408 మంది బాలబాలికలకు గడిచిన ఆర్నెల్లుకు గాను రూ.97.92 లక్షలు వారి ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి కె.ఉమారాణి బుధవారం పేర్కొన్నారు. జిల్లాలోని తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల కింద 2023-24 ఏడాదికి ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేలు చొప్పున ఈ సహాయం అందజేయటం జరిగిందన్నారు. ఈ పథకం కింద 18 ఏళ్లలోపు తల్లీదండ్రిలేని, తల్లీ లేదా తండ్రిలేని, హెచ్‌ఐవీ సోకిన పిల్లలు, హెచ్‌ఐవీలో ప్రతిభావంతులైన పిల్లలు, తల్లీదండ్రి ఉండి పిల్లల్ని పెంచే ఆర్థిక స్థామతలేని వారికి కేంద్ర ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ ద్వారా ఈ సహాయం అందజేసుందని వివరించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

గుంటూరు మెడికల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ప్రాంగణంలో బుధవారం 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూ స్కై' నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై ఉద్యోగులతో డీఎంహెచ్‌ఓ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్, పాలిథిన్, వాహనాల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. సైకిల్ వాడటంతో పాటు నడకను అలవరచుకోవాలని తెలిపారు. పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చెప్పారు. సేంద్రియ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయలు పండించాలని, కట్టెలు, బొగ్గు వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లను కాల్చకూడదని, వాటిని రీసైక్లింగ్‌కు పంపాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ డి.అన్నపూర్ణ, డాక్టర్ వరప్రసాద్, ఏ.జయప్రసాద్, డాక్టర్ ప్రీతి, గిరిధర్, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద సహాయ చర్యలకు 669 వాహనాల ఏర్పాటు

డీటీసీ షేక్ కరీం

పట్నంబజారు: విజయవాడ నగరంలో, గుంటూరు జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు వరదల్లో చిక్కుకున్న ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, ఆహార పదార్థాలను సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 2నుంచి 11వరకు 669 వాహనాలను ఏర్పాటు చేసినట్లు డీటీసీ షేక్ కరీం తెలిపారు. ఇందులో 181 బస్సులు, 294 ట్రాక్టర్లు, 175 రవాణా వాహనాలు, ఇతర వాహనాలు 10 ఉన్నట్లు వివరించారు.వీటిని జిల్లా కలెక్టర్ సూచనల మేరకు నగరపాలక సంస్థ, సివిల్ సప్లైస్, మార్కెటింగ్, రెవెన్యూ శాఖలకు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. వాహనాలను సిబ్బందితో పాటు నీళ్ల బాటిళ్లు, కూరగాయాలు, నిత్యావసర వస్తువులు రవాణాకు ఉపయోగించినట్లు తెలిపారు. విజయవాడ వరదల కారణంగా దెబ్బతిన్న వాహనాలకు సంబంధించి బీమా క్లెయిమ్ స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఇందులో గుంటూరు డీటీసీ, పల్నాడు డీటీఓ, ఇతర అధికారులు సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. వాహనాల కు మరమ్మతులకు మెకానిక్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పునరుద్ధరణ పనులకు ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు రావాలి

నరసరావుపేట ఈస్ట్/మాచర్ల: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టనున్న పునరుద్ధరణ పనుల నిమిత్తం నైపుణ్యం ఉన్న ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు అవసరమని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ పునరుద్ధరణ పనులకు వెళ్లే కార్మికులకు రోజుకు కనీసం రూ.1000తో పాటు అదనంగా పనిని బట్టి ధరల పట్టికను అనుసరించి చెల్లింపులు, ఉచిత భోజన వసతులు కల్పించనున్నట్లు వివరించారు. వచ్చేవారు తమ సొంత టూల్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఆధార్, పాన్ కార్డు, పాస్‌పోర్టు ఫొటో, లేబరు లేదా ఇతర వృత్తి సర్టిఫికెట్‌తో హాజరుకావాలని సూచించారు. విజయవాడకు ఉచిత ప్రయాణం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వివరాలకు తమ సిబ్బంది ఎం.వీరాంజనేయులు (9160200652), సురేష్ (9100566581), వి.సిహెచ్.రామాంజనేయులు (9160031006)ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల అక్రమ అరెస్టులు తగదు

గురజాల: పిడుగురాళ్ల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు వెన్నా రాజశేఖరరెడ్డి, షేక్ మాబులను పిడుగురాళ్ల పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం తగదని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. అరెస్ట్ చేసి గురజాలకు తరలించినట్లు సమాచారంతో బుధవారం రాత్రి సీఐ భాస్కర్‌ను కలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ)లు సీఐను కలసి అరెస్ట్ వివరాలు ఇవ్వాలని కోరారు. సీఐ భాస్కర్ మాట్లాడుతూ పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ మా పరిధిలో లేదని, మాకు వారి అరెస్ట్‌తో ఎటువంటి సంబంధం లేదని నాయకులు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అక్రమ కేసులు పెట్టి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను బెదిరించాలని టీడీపీ నాయకులు చూస్తున్నారని చెప్పారు. సీఐని కలిసిన వారిలో మండల కన్వీనర్ సిద్ధాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, మన్నెం ప్రసాదరావు, కె.అనిల్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పునః పరిశీలించాలి

నరసరావుపేట: ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌పై సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు మాలమహానాడు నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. బీఎస్పీ, భీమ్ ఆర్మీ, వీసీకే ముఖ్యనాయకులు చేస్తున్న ధర్నాకు మద్దతుగా రాష్ట్రంలో అన్నీ జిల్లాల్లో జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదాజాన్‌పాల్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కాంస్య విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు గోదాబాల, వుస్తేలా జయరావు, సాతులూరి బసవయ్య, దార్ల రాజు, మాతంగి సుధాకర్, కూచిపూడి జాన్‌బాబు, మణిక మహేష్ పాల్గొన్నారు.



కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మట్టి గణపయ్యా.. ప్రణామం

- శ్రీశ్రీనగర్‌లో 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం
- దర్శించుకునేందుకు తరలివస్తున్న భక్త జన సందోహం

సత్తెనపల్లి: పూర్వకాలం నుంచి వినాయక చవితి పర్వదిన వేడుకలు అంటే మట్టి ప్రతిమలను మాత్రమే పూజించేవారు. కాలానుగుణంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వినియోగంలోకి వచ్చాయి. ఇవి పూజకు నిషిద్ధమని ఇటు పండితులు .. అటు పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఈ క్రమంలో స్వచ్ఛమైన మట్టితో తయారుచేసిన వినాయకుని ప్రతిమను పూజకు ఉపయోగించాలని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శ్రీశ్రీ నగర్‌లోని శ్రీ సత్యసాయి యువజన సంఘం ఏర్పాటు చేసింది. సినీ ఆర్ట్ డైరెక్టర్ వీరాంజనేయులు పర్యవేక్షణలో సహజ వనరులతో తయారైన 61 అడుగుల వినాయక మట్టి ప్రతిమను వినాయక చవితి పండుగ రోజు ఏర్పాటు చేసి నవరాత్రుల్లో భాగంగా నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా 5వ రోజు బుధవారం 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం వద్ద హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. పలు గ్రామాల నుంచి వినాయకుడి విగ్రహాన్ని సందర్శించేందుకు భక్తజనం పోటెత్తింది. 6వ రోజు గురువారం అన్నసంతర్పణ నిర్వహించనున్నట్లు శ్రీ సత్య సాయి యువజన సంఘం అధ్యక్షుడు సాయి తేజ రాజు తెలిపారు.



సత్తెనపల్లిలో పూజలు అందుకుంటున్న 61 అడుగులు మట్టి వినాయక విగ్రహం